# గెలికన్న

వి.యస్.నారాయణ



మధ్యాహ్నం పన్నెండు గంటలప్పుడు గోల్కొండలో ఎక్కిన నేను ఆ ఉక్కపోతకు గూడలెగరేశాను. మహాచికాకు పడిపోయి—గోల్కొండకు ఎయిర్ కండిషన్డ్ బోగీ పెట్టని రైల్వే వాళ్లను, ఎక్కిన పెట్టెలో పనిచేయని ఫ్యానుని, కుప్పలు కుప్పలుగా ఏ పనీ లేకుండా తిరిగుతున్నట్లున్న జనాన్నీ తిట్టిపోస్తున్నాను. హాయిగా ఏ గోలయినా లేకుండా కూర్చుందామన్నా మొదటి తరగతిలో సీటు దొరికి చావలేదు.

"నేను చెబుతూనే ఉన్నాను ఈ బండికి వద్దండీ అని... వింటేనా... అనుభవించండి!" మా భార్యామణిగారు ఉవాచ... ఆడవాళ్లకు 'సన్నాయి నొక్కుల ఛాన్సు దొరకాలేగాని వదిలిపెట్టే అవకాశం ఇవ్వరు.

"ఈ బండికి వెళ్లకపోతే ఈ ఎండలో ఆ బస్సుల్లో పది నాలుగు గంటలు ప్రయాణం చేస్తామా... వళ్లు హూనమైపోతుంది. ఎట్లాలేదన్నా అయిదింటికన్నా వేణుగోపాల్ ఇంట్లో ఉండాలి. పెళ్లి ఏడు గంటలకు. రెండు గంటల ముందు ఆ మాత్రమన్నా ముందు వెళ్లకపోతే వాడెలా తిట్టిపోస్తాడో నీకు తెలుసు కదా!" పెట్టె తీసి పైన పెడుతూ అన్నాను.

"నిజమే అనుకోండి. కారులో అయితే ఎంత హాయిగా ఉండేది?"

"సడన్‌గా మన డ్రైవర్‌కి కడుపులో నొప్పి వస్తుందని నేను కలగన్నానా. ఓ గంట ముందు తెలిసినా ఏ స్నేహితుడికైనా ఫోను చేసి వాళ్ల డ్రైవర్‌ని తెప్పించి ఉండేవాడిని. నాకు ఇంత దూరం డ్రైవ్ చేయటం మహా చికాకు బాబూ!"

"బద్ధకం అని చెప్పరాదూ!" అన్నది ముఖం పక్కకు తిప్పుకుంటూ.

నేను సీటు మీద ఇబ్బందిగా కదిలాను. "ఇదొక నయంలే. కాస్త కుషన్ అన్నా ఏడ్చింది!" అన్నాను. "నాకు బద్ధకం అనేశావ్. కాని అంతసేపు కళ్లార్పకుండా రోడ్డు మీదకు చూస్తూ కూర్చోవడం నా తరంగాదు!"

"మరీ షోకులు... ఏం చేస్తాం. కానీయండీ!"

"దెప్పబోకవోయ్ భామామణీ!"

రైలు ఇంజన్ కూత కూసింది. గార్డు విజిల్ ఊదాడు. ప్లాట్‌ఫారం మీద జనం అడ్డంగా, అర్థంకానట్లుగా పరుగెడుతున్నారు. చెమటలు కారుస్తున్న శరీరాలకు సేద దీరుస్తున్నట్లుగా బండి కదలటంతో పెట్టెలోకి గాలి వచ్చి హాయిగా ఉన్నది.



అప్పుడే నేను ఉలిక్కిపడేలా ఎదురుగా కూర్చొని ఉన్న ఓ స్త్రీ నన్నే కళ్లు పెద్దవి చేసుకుని విచిత్రంగా చూస్తూ కనబడింది.

ఒకళ్ల కళ్లల్లోకి ఒకళ్లం అలా చూస్తూనే కొద్దిసేపు ఉండిపోయాం.

రైలు ప్లాట్‌ఫారం వదిలేసి రైలు నిలయం కూడా దాటి వెళ్లిపోతున్నది.

మా శ్రీమతిగారు సికింద్రాబాద్‌లో కొన్న తెలుగు పత్రికను తెరిచింది.

"మీ పేరు శకుంతలగారు కదూ?"

"మీరు జగన్నాధరావుగారు కదూ?"

"అవును!"

"మీరు హైదరాబాదులో ఉంటున్నారా?"

"అవును. మీరు?"

"నేను ఆలేరులో ఉంటున్నాను. అమ్మా, నాన్న హైదరాబాద్‌లో ఉంటున్నారు!"

"ఆలేరు అంటే... మీ భర్తగారికి అక్కడ ఉద్యోగమన్నమాట!"

శకుంతల మొఖం నా ప్రశ్నకు తెల్లగా పాలిపోవటం గమనించాను. నాకు అర్థంకాలేదు ఆమెలోని వ్యాకులత ఏమిటో ఆమె తల దించుకున్నది. ఆమె పెదిమలు దుఃఖంతో వణుకుతున్నట్లున్నాయి.

"లేదు. నాకే!" చాలా అసహనంగా అటూ ఇటూ కదిలింది.

అది గమనించి మాట మారుస్తున్నట్లుగా "ఈమె నా భార్యామణి. అరుంధతి. వీరు శకుంతలగారని నాకు.... మాకు పరిచయస్థురాలు!" అన్నాను.

వాళ్లిద్దరూ ఒకళ్ల కళ్లల్లోకి ఒకళ్లు చూసుకున్నారు ఆ చూపులు నాకు చాలా విచిత్రంగా ఉన్నట్లనిపించాయి.

అరుంధతి మా ఇద్దరినీ పట్టి పట్టి చూస్తున్నది. ఎప్పుడూ తనకు పరిచయంలేని స్త్రీని భర్తగారు పూర్వాపరాలు మరీ మరీ కనుక్కుంటున్నాడంటే ఆమె చాలా పరిచయస్థురాలే అయి ఉండాలి అని అనుకుంటూండాలి.

శకుంతల అందగత్తె. నా కళ్లకైతే అందగత్తెలలో అందగత్తె. అయిదడుగుల అయిదంగుళాల పొడువు ఉండి, ఎర్రటి ఎరుపు రంగులో, కొనతేరిన ముక్కుతో, విశాలమైన కళ్లతో, పెద్ద తలకట్టుతో ఎవరికి. కనబడదు అందంగా!

బ్రహ్మ ఒక్కొక్కసారి మనస్సు దగ్గిర పెట్టుకుని బొమ్మలు చేస్తుంటాడు. అలా తక్కువసార్లు చేసిన బొమ్మలలో కూడా ప్రధమ స్థానంలో ఉంటుంది శకుంతల!

పెళ్లిచూపులనాడు ముసిముసి నవ్వులతో సిగ్గుగా తలవంచుకుని ఆలవోకగా నా వంక చూసినప్పుడు —ఆ కళ్లల్లోనుంచి వెలువడిన చూపుల బాణాలు నా గుండెల్ని తాకి నన్ను స్వర్గంలో తిప్పినాయి.

అందుకే—

వాళ్ల ఆర్థికస్థితి చూడలేదు. వాళ్ల నాన్న ఉద్యోగం చూడలేదు. ఇంకా ఆమెకు పెళ్లికావాల్సిన ముగ్గురు చెల్లెళ్లున్నారని. చదువుల్లో ఇద్దరు తమ్ముళ్లున్నారని —వాళ్ల ఖర్చులతో సతమతమవుతూ, నాకేమీ పెట్టలేరని కూడా నేను చూడలేదు. ఆ క్షణాన నా అంతస్థు నాకు గుర్తు లేదు. నా బంగళాలు నాకు గుర్తు లేవు. మా కార్లు నాకు గుర్తులేవు.

మా నాన్న సంపాదిస్తున్న లక్షలకు లక్షల డబ్బు నాకు గుర్తులేదు.

సర్వం మరిచి —నేను శకుంతలను తప్ప ఈ ప్రపంచంలో మరెవ్వరినీ పెళ్లి చేసుకోను అని అన్నప్పుడు మా అమ్మా, నాన్నా నవ్వేశారు.

"గుడ్.. నీకు నచ్చిన అమ్మాయితో నువ్వు పొందే సుఖం, మేం మెచ్చిన అమ్మాయి తెచ్చే డబ్బుతో పొందలేవు. మనకున్నది చాలు. గో ఎహెడ్!"

మా అమ్మ సరేసరి. "నీకు అష్టైశ్వర్యాలు ఆ అమ్మాయేరా నాన్నా!" అన్నది.

"టిక్కెట్ ప్లీజ్!"

గొలుసు లాగి రైలు ఆపినట్లుగా టిక్కెట్టు కలెక్టరు నా గతపుటాలోచనలకు కత్తెర్లు వేసి నన్ను రైల్లోకి లాగాడు కొద్దిసేపు.

అంతా అయిపోయింది. ఇంక లగ్నాలు పెట్టుకోవటమే ఆలస్యం అనుకుంటున్న సమయంలో ఆ అమ్మాయి ఈ సంబంధానికి ఇష్టపడటంలేదు అనే వార్త నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. చికాకు కలిగించింది. అర్థంపర్థంలేని అయోమయంలో పడవేసింది.

"ఎందుకని... నేను నచ్చలేదటనా?"

"ఈ ప్రపంచంలో నిన్ను చూసిన ఏ



అమ్మాయి ఆ మాట అనగలుగుతుంది. అదికాదుగాని అసలు కారణం తెలియటంలేదు!" మధ్యవర్తి అన్నాడు.

అమ్మా, నాన్నా, నేనూ భోజనాల దగ్గర కూర్చున్నప్పుడు ఈ విషయమే చర్చకు వచ్చింది. మేం ఒకటి అనుకున్నాం. ఆ అమ్మాయి ఇప్పటికే ఎవరినో ప్రేమించి ఉండాలి. అందుకే ఇలా జరిగింది అని.

తరువాత అమ్మ నిర్లిప్తంగా అన్నది కూడా. "పోనీయ్‌లేరా పెద్దల బలవంతంతో ఈ పెళ్లి జరిపినా —అదే నిజమయితే మీరు సుఖంగా ఉండగలుగుతారా. నీకు నచ్చిన అమ్మాయి నీకు దక్కకపోవటం నీ దురదృష్టమే అవ్వవచ్చుగాని —ఇప్పుడు నువ్వు అదృష్టవంతుడువిగానే భావించు."

అంత ఇష్టంలేనిది పెళ్లిచూపులకు ఎందుకు కూర్చోవాలిట? కూర్చున్నదిపో —అంత చక్కగా ఎందుకు అలంకరించుకోవాలట? అలంకరించుకున్నది పో —ఆ ఎర్రటి పెదాల మీద అంత చక్కటి చిరునవ్వు ఎందుకు పూయించాలట?

'ఛీ —ఈ ఆడవాళ్లను నమ్మగూడదు!' కసిగా అనుకున్నాను.

సరిగ్గా ఆనాటికి పది సంవత్సరాల తరువాత ఈనాడు తిరిగి దర్శనమిచ్చింది ఆ శకుంతల.

నేను మర్చిపోలేని ఆ రూపం తిరిగి నా కళ్ల ముందు తళుక్కుమన్నది ఈ రోజున.

అయితే —

ఆ మొఖంలో అప్పటి మెరుపు లేదు. ఆ కళ్లల్లో అప్పటి వెలుగు లేదు. ఆ పెదిమల మీద అప్పటి చిరునవ్వు లేదు.

ఆ ప్రేమించినవాడు నాలుగు రోజులు మురిపించి, మాయచేసి మోసం చేసి పారిపోలేదు గదా!

ఏమో —


కృంగి కృశించిపోయినట్లుగా ఆ శరీరం ఏ దిగుళ్లవలల్లోనో చిక్కుకున్నట్లుగా ఆ కళ్లచుట్టూ నల్లటి గీతలు.

అవును —ఇందాకటి నుంచి గమనించలేదు. ఆ నుదుటిన కుంకుమ బొట్టు బదులుగా చిన్న స్టిక్కర్‌లాంటిది ఉన్నదేమిటి?

చటుక్కున చేతులవంక చూశాను. మెడ వంక చూశాను. ఆమెను అలా విభ్రాంతిగా చూస్తూనే ఉండిపోయాను.

ఇందాక —మీ భర్త ఆలేరులో పనిచేస్తున్నారా అన్నప్పుడే ఆమె మొఖం తెల్లగా పాలిపోవటం గుర్తుకు వచ్చింది.

క్షణం తడబడ్డాను.



నువ్వా, నేనా?

'రంగీలా' ద్వారా ఉత్తరాదిని ఇప్పటికే ఒక ఊపు ఊపిన ఊర్మిళ, 'జల్లాద్' ద్వారా నిద్రపట్టకుండా చేసిన రంభ కలిసి, 'కుద్రత్' చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో అక్షయ్‌ఖన్నా హీరో. తండ్రి వినోద్ ఖన్నా మాదిరిగానే కాస్త పొగరున్న అక్షయ్, తనకు నచ్చిన హీరోయిన్ ఉంటేనే చిత్రంలో ఉంటానని చెబుతూ వస్తున్నాడు. ఒక చిత్రంలో దీప్తీ భట్నాగర్‌ను తొలగించాలని డిమాండ్ చేసి, నిర్మాత ఆ పని చేయనందుకు తానే బయట పడ్డాడు. 'కుద్రత్'లో మాత్రం అతనికి ఇద్దరు హీరోయిన్‌లూ నచ్చారు. ఇంకేం, రంభ, ఊర్మిళల కాంబినేషన్‌తో 'కుద్రత్' అదరహో అన్నమాట! మసూద్ అన్సారి



నా ఊహ నిజంగాకుండా చేయి భగవంతుడా అని వేయి దేవుళ్లకు మనస్సులోనే మొక్కుకున్నాను. పది సంవత్సరాల క్రితం ఆమె మీద నేను ఏర్పరచుకున్న కసిని గూడా మరిచిపోయాను.

అంత అందమైన శకుంతలను భర్తృవిహీనగా ఊహించలేను నేను.

పెద్ద శబ్దంతో రైలు బీబీనగర్ స్టేషన్ దాటుతోంది.

శూన్యంలోకి చూస్తున్నట్లుగా ఆమె మొఖంలోనే చూస్తూ ఉండిపోయాను కొన్ని నిముషాల వరకు.

నా చూపులకు నా భార్యామణి చాలా ఇబ్బందిగా అటూ ఇటూ కదలటం నేను గమనించాను —కానీ నా కళ్లు, నా మనస్సు శకుంతలను దాటి బయటకు రావటంలేదు.

"అదెలా జరిగింది?"

"ఏది?"

"అదే —మీ వారు పోవడం!"

"వారికి కాలం తీరింది వెళ్లిపోయారు!" చాలా నిర్లిప్తంగా అన్నది. "ప్రయాణీకులు ఎవరి స్టేషన్‌లో వారు దిగిపోతారు. ఆయన దిగవలసిన ఊరు ముందుగా వచ్చింది — అంతే!"

ఆమె చెప్పిన తీరుకు నా గొంతు తడారిపోయింది.

ఆ విషయం కదిలించినప్పుడు ఆమెలో ఎలాంటి ఉద్విగ్నతా లేదు. ఎలాంటి దుఃఖమూ లేదు —అసలు ఎలాంటి ప్రకంపనా ఉన్నట్లుగా అనిపించలేదు. భోజనం ఎందుకు చేయలేదూ అంటే —ఆకలి లేదు అన్నంత తేలిగ్గా చెప్పింది. అంటే తనని తాను ఎంతగానో నిగ్రహించుకుంటున్నదన్నమాట!

పోతున్న రైలు మోత నాకు వినబడటంలేదు. పిచ్చి పిచ్చిగా మాట్లాడుకుంటున్న తోటి ప్రయాణీకుల మాటలు నాకు వినబడటంలేదు. దడదడలాడుతున్న పెట్టెలోని ఫ్యానుల ధ్వని నాకు వినిపించటంలేదు.

భగవంతుడా —అంత అందమైన శకుంతలను సృష్టించిన నువ్వే ఆమెకు అంద దుఃఖాన్ని కూడా ఎందుకు కలిగించావ్?

"సారీ! నాకు చాలా బాధగా ఉన్నది. ఐయామ్ సారీ!"

"మీ బాధ నాకు ఉపశమనం కలిగిస్తుందని నేననుకోను. ఎవరి జీవితాలు ఎలా వెళ్లిపోవాల్సి ఉంటే అలా వెళ్లిపోతాయి. ఒకళ్ల గురించి ఒకళ్లు బాధపడే అవశ్యకత ఎవరికీ ఉండకూడదు. మనం బాధ్యులమా? మన చేతిలో ఉన్నదా ఇదంతా?" సర్వం త్యజించిన దానిలా చాలా ఉదాసీనంగా మాట్లాడుతున్నది శకుంతల.

మా ఆవిడ ఫ్లాస్కు తీసింది. కప్పులో కాఫీ ఉంటుతూ, "మీరు తాగుతారా?" అన్నది నా



వంక చూస్తూ.

"ఇవ్వు... శకుంతలగారికి కూడా ఇవ్వు!"

"నాకు వద్దండీ. నాకు కాఫీ అలవాటు లేదు!"

మా ఆవిడ మాట్లాడలేదు. నేను మాట్లాడలేదు. మౌనంగా దాని చేతిలో నుంచి కాఫీ కప్పు అందుకుని చిన్నగా తాగుతున్నాను.

ఆమె నన్ను నిరాకరించటానికి కారణం మేం ఊహించింది అయి ఉండవచ్చు, అయి ఉండకపోవచ్చు. అది ఏదైనా దాని వలన ఆమె ఏం కోల్పోయిందో, ఎంతగా నష్టపోయిందో — జీవిత సౌభాగ్యాన్ని, సౌభాగ్యాన్ని ఎలా చేతులారా త్రుంచివేసుకున్నదో ఇప్పుడు అర్థం అయి ఉంటుంది!

భర్త బ్రతికుండగా కాకపోయినా — తరువాతనయినా నేను గుర్తుకు వస్తూ ఉండి ఉండవచ్చు. తను చేసిన పొరబాటును అవలోకనం చేసుకుంటూ ఉండవచ్చు. కాదూ, ఈ క్షణాన నన్ను చూసినప్పుడయినా గతమంతా మనస్సు తెరమీద కదిలి పశ్చాత్తాపపడుతూ ఉండాలి.

మా ఆవిడ తిరిగి పుస్తక పఠనంలోపడింది. అది నిజంగా చదువుతున్నదో లేక చూపుల్ని మాత్రం పుస్తకం మీదనే కేంద్రీకరించి, చెవుల్ని మా వైపు గురిపెట్టి ఉంటుందో ఆ భగవంతుడికే తెలియాలి. ఒకవేళ అది అలా చేసినా దానిని తప్పుపట్టవలసిన అవసరంలేదు. ఏ స్త్రీ అయినా భర్తను అలాంటి పరిస్థితులలో అలాగే గమనిస్తూ ఉంటుంది!

ఏది ఏమైనా ఆ క్షణాన నా శ్రీమతిని నేను పట్టించుకోదలుచుకోలేదు. తప్పు చేయనప్పుడు భయపడవలసిన అవసరంలేదు, బాధపడవలసిన అగత్యమూ లేదు!

"సో..." తడబడుతున్నట్లుగా ఆగాను. "మీరానాడు తీసుకున్న నిర్ణయం ఎంత అనర్థానికి హేతువయిందో గుర్తించారా?" అన్నాను.

క్షణం నేను తప్పుగా మాట్లాడుతున్నానా అని అనిపించింది. కానీ మనిషిలోని బలహీనత ఒక్కొక్కసారి తన మాట్లాడే మాటల్లోని తప్పొప్పులను గమనించదు. నేనూ మనిషినే. మనస్సు అట్టడుగు పొరల్లో ఇంకా పేరుకుపోయి ఉన్న —నన్ను కాదన్నదనే నిజం —నా మనస్సును మౌనంగా ఉండనీయకుండా చేసింది.

ఆమె తప్పును ఇప్పటికైనా ఆమె తెలుసుకుని ఉంటే నాకదో ఆనందం!

"నా నుదుటన ఇలా రాసి ఉన్నప్పుడు ఆయనకు గాకపోతే మరొకరికి అది శాపమై ఉండేది!" చాలా పేలవంగా నవ్వింది.

నేను ఉలిక్కిపడ్డాను. ఒళ్లంతా ఒక్కసారి ఏదో భయంకర నిజం ఊపి

# మాయాముఖం



ఎటు చూసినా రకరకాల ముఖాల అచ్చులే
రంగు రంగుల్లో రాశి పోసి ఉన్నాయి
నవ్వుతో గిలిగింతలు పెట్టేవీ
భయంతో గగుర్పాటు కలిగించేవీ
చరిత్ర పురుషులవీ, చరిత్ర హీనులవీ
మనుషులవీ మేకాలవీ
దేవతలవీ దయ్యాలవీ
రకరకాల ముఖాల అచ్చులు
రాసులు పోసి ఉన్నాయి!


ఏదైనా అచ్చు ముఖానికి తగిలించుకుంటే!
కుతూహలం నన్ను బాగా కుదిపింది.
నా ముఖానికి సరిపడా
అచ్చు కోసం వెదకసాగాను
దేవతలూ దెయ్యాలూ కాని
రాజులూ, రాక్షసులూ గాని
నా ముఖాని కతికినట్లు లేదు
'హిమాన్'లూ, హనుమాన్లూ కన్నా
ఆకర్షణీయమైన దానికోసం గాలిస్తున్నాను.

వెతగ్గా వెతగ్గా దొరికిందొక అచ్చు
ధూళి నిండిన ఒక ముసలి ముఖం
దుమ్ము దులిపి చూశాను.
గుండూ, గుండ్రటి కళ్లద్దాలూ

ప్రసన్న వదనం, పెదాల మీద చిరునవ్వూ
నన్ను బాగా ఆకట్టుకున్నాయి.
ఆలస్యం చెయ్యకుండా అచ్చు తగిలించుకున్నాను
ఇప్పుడు నా ముఖం
గుండూ గుండ్రటి కళ్లద్దాలూ
పెదాల మీద చిర్నవ్వుతో వెలిగిపోతోంది
ఎక్కడి కెళ్లినా నా ముఖానికి ఆదరణే.

అసలు ముఖం మరుగున పడిందన్న విచారమే లేదు
కొత్త ముఖానికి కోరుకున్నంత గౌరవం, మర్యాదా
ఇప్పు డీ చిరునవ్వుతో వేలమందిని గెలవగలను. గెల్చాను.
అధికారపు పందేన్ని అంచెలంచెలుగా గెల్చాను.
ఆనందంతో పైమెట్టు మీద హుందాగా నిలబడి అక్కడున్న వాళ్లందర్నీ
ఒక్కసారి చూశాను
ఆశ్చర్యం
వాళ్లంతా ముఖాలకు అచ్చులు తొడుక్కున్నవాళ్లే
గుండూ, గుండ్రటి కళ్లద్దాలూ
ప్రసన్న వదనం, పెదాల మీద చిరునవ్వూ
అన్నీ అచ్చు అలాగే ఉన్నాయి.

విశ్వనాథ సూర్యనారాయణ



## 'రంగీలా' తెచ్చిన తంటా



'రంగీలా' ద్వారా ఊర్మిళ చిత్రరంగాన్ని ఒక ఊపు ఊపిన సంగతి విషయం యథార్థం. ఈ చిత్రం వల్ల ఆమె రేటు పెరిగింది. పెద్ద హీరోయిన్ల స్థాయికి వచ్చింది. అయితే దాంట్లో మోతాదుకు మించి ఎక్స్‌పోజ్ చేయడమే ఆమెకు తంటాలు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం అందరూ అదే తరహా పాత్రలు ఆఫర్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న రెండు చిత్రాలూ ఇద్దరు హీరోయిన్లున్నవే. బోనీకపూర్ తాజాగా నిర్మిస్తున్న 'జుదాయీ'లో తానే పెద్ద హీరోయిన్ అని భావిస్తుంటే, ఇంకో హీరోయిన్ శ్రీదేవి అని తెలిసి, నీరుగారిపోయిందట ఊర్మిళ! అందరూ రాం గోపాల్‌వర్మలా తన ప్రతిభను గుర్తించరనే విషయం చాలా లేటుగా తెలుసుకుంది ఊర్మిళ!

మసూద్ అన్సారి

---

వదిలినట్లనిపించింది. శరీరమంతా చెమటలు పట్టసాగినాయి.

అంటే... అంటే....

ఆ మృత్యువు నన్నయినా కబళించి ఉండేదే అనేదేనా ఆమె మాటల్లోని అర్థం!

నా అవస్థను చూసి మరోసారి ఆమె నవ్వినట్లనిపించింది నాకు. కొద్ది క్షణాల వరకూ తలెత్తలేకపోయాను. నోరు తెరవలేనంతగా కుట్టివేసింది ఆమె నా పెదిమలను.

మనస్సంతా వికలమయింది. చంచలమైన ఆలోచనలతో సతమతవవుతూ చాలాసేపు అలాగే మౌనంగా ఉండిపోయాను. చిన్న ముల్లకంపను తీసివేసే ప్రయత్నంలో పెద్ద తేనె తుట్టెనే కదిలించివేశాను.

కాని ఇంత మానసిక ఆందోళనకు గురిచేసిన ఆమె సమాధానం నా గుండెలోతుల్లోంచి పుట్టుకువచ్చిన ఆ కోరికను అణగద్రొక్కలేకపోతున్నది.

నన్ను నేను దిటువు చేసుకోక తప్పదు. నాకున్నది ఇంకో కొద్ది నిమిషాల సమయమే.

రైలు భువనగిరి స్టేషన్‌ను వదులుతుండటంతో నా ఆదుర్దా మరింత ఎక్కువయింది. అక్కడకు ఆలేరు ప్రయాణం మరికొన్ని నిముషాలు మాత్రమే. ఆలేరు వచ్చేస్తుంది. ఆమె దిగిపోతుంది. జీవితంలో ఆమె తిరిగి కనబడకపోవచ్చు. అప్పుడు ఇక జీవితంలో నా ప్రశ్నకు నేను సమాధానం పొందే అవకాశమే లేదు.

ఊహూం... ఆమెను వదిలిపెట్టగూడదు.

తను నన్ను ఏ కారణంతో నిరాకరించింది?

అది ఎలాంటి కారణమయినా సరే నేను వింటే ఇక ఆ విషయం నాలో శేష ప్రశ్నగా మిగిలే అవకాశం లేదు.

నన్ను నిరాకరించటానికి కారణం ఆమెలోని తప్పేనా? లేక ఆమె నాలో చూసిన తప్పా?

నా భార్య కాఫీ తాగిన కప్పులను తీసుకుని కడిగేటందుకు వాష్ బేసిన్ దగ్గరకు వెళ్లింది.

"నేను ప్రశ్న అడుగుతాను. మీరు సమాధానం చెప్పాలి!" అన్నాను.

శకుంతల సాలోచనగా నా వంక ఒక్కసారి చూసి "అడగండి?" అన్నది.

"ఓ.కే. ఇందాక మీ మాటల్లోలాగా నాకు మంచి జరిగిందనే అనుకుందాం. కాని మీ వాళ్లు ఇష్టత తెలిపినతరువాత తిరిగి మీ అభిప్రాయాన్ని మార్చుకుని నన్ను నిరాకరించవలసిన అవసరం ఎందుకు కలిగింది —సమాధానం సూటిగా చెప్పండి. వినాలని నాకు చాలా కుతూహలంగా ఉన్నది!" అడగవలసింది అడిగినతరువాత చాలా హాయిగా శ్వాస పీల్చుకున్నాను.

ఆమె క్షణం గూడా ఆలస్యం చేయలేదు. "నుదుటి రాతను ఎవరు తప్పించగలరు?" అన్నది నిర్లిప్తంగా.

"అది నా ప్రశ్నకు సమాధానం కాదు!"

"కొన్ని ప్రశ్నలు ప్రశ్నలుగా ఉంటేనే అందంగా ఉంటాయేమో?" అన్నది పేలవంగా నవ్వి.

"కానీ మీ ఉద్దేశ్యం విని నేనెంతగా బాధపడ్డానో మీకు తెలుసా?"

కొద్ది క్షణాలు సంశయిస్తున్నట్లుగా ఆగి, "మీరెంత బాధపడ్డారో ఊహించగలను. కాని అలా చెప్పటానికి నేనెంత గుండె నిబ్బరం చేసుకున్నానో మీరు ఊహించలేరు!" అన్నది.

నా భార్య వచ్చింది.

మేం మౌనంగా కూర్చుని ఉన్నాం.

ఎక్కినప్పుడు చికాకుపడ్డ ఆ పెట్టెలో మరింత మంది గుంపులు గుంపులుగా ఎక్కినా నాకు ఏమాత్రం ఇబ్బంది అనిపించలేదు. వెయ్యి మోడువారిన చెట్ల నడుమ లతలా కనిపించిన శకుంతల నన్ను మరో ప్రపంచంలో పడేసింది. కానీ ఆ లత కూడా ఎవ్వరికీ పనికిరాని, ఎందుకూ పనికిరాని పిచ్చి ఆకుల తీగలా బ్రతుకున్నదని తెలిసినప్పుడు —ఈ ప్రపంచంలో నేను బాధపడినంతగా మరెవ్వరూ బాధపడి ఉండరు.

అరుంధతి అడిగింది. "ఇంకెంత సేపు కూర్చోవాలి?"

"ఆలేరు... జనగాం... కాజీపేట!" ఆలేరు అంటున్నప్పుడు జీవితంలో మరోసారి చూడలేని శకుంతలను చూశాను. మహా అయితే ఇంకో పదిహేను నిముషాలు అలా నా ఎదురుగ్గా కూర్చొని ఉంటుంది.

ఈ కొద్ది సమయంలోనే నేను శకుంతల నుండి నా ప్రశ్నకు సమాధానం ఎలాగైనా సరే పొందాలి!

"ఏం చేస్తున్నారు మీరు అక్కడ?"

"విద్యాశాఖ వారి బడిలో ఉపాధ్యాయినిగా!"

"ఎన్నాళ్ల నుండి?"

"ఎనిమిది సంవత్సరాలయింది చేరి!"

"అంటే —" వింతగా చూస్తూ ముందుకు వంగాను.

"నేను పెళ్లయిన ఆరు నెలలకే విధవనయ్యాను. తరువాత ఆరు నెలలకు తల్లినయ్యాను." ఆమె తలవంచుకునే చెప్పింది.

నేను నా తలను వెనుక చెక్క కానించి కళ్లు మూసుకున్నాను.

"అప్పటినుండీ ఆలేరేనా?"

ఆమె చిన్నగా నవ్వింది.

"మునాపూర్‌లో స్కూలు జీవితం ప్రారంభమయింది. తరువాత జనగాం వచ్చాను. ఆపైన ఆలేరు. బహుశః కొన్నాళ్లకు భువనగిరి... మరికొంత కాలానికి హైదరాబాద్... ప్రభుత్వంతో పనులు గదండీ... నత్తనడక..."

"మీకు అబ్బాయా, అమ్మాయా?"

"గర్వంగా చెప్పుకోవాలీ అంటే

---

## ప్రేమ చెడినా...



కమల్ సాద్నాతో ప్రేమ మూన్నాళ్ల ముచ్చటగా ముగిసి పోవడంతో ప్రేయసి రీతూ శివపురి 'తానే మారెనా నన్నేమారెనా' అని సోలో గీతాలు పాడుకుంటూ కూర్చోకుండా, 'పోతే పోయింది బోడి ప్రేమ' అనుకుంటూ, సరదాగా షికార్లు చేస్తున్నది. ముంబాయిలో జరిగే ప్రతి విందుకూ, వినోదానికీ వెళ్తూ వారి ప్రేమ తెలిసిన వారికి బోలెడంత ఆశ్చర్యాన్ని కలిగిస్తూంది రీతూ. అంతేకాదు, ఈమధ్య తన బర్త్‌డే పార్టీని ధూమ్ ధామ్‌గా చేసుకుని, పరిశ్రమ లోని పెద్దవాళ్లందరినీ పిలిచింది. అమ్మాయి అంటే రీతూలా ఉండాలి. కాదంటారా?

మసూద్ అన్సారి



వంశోద్ధారకుడే. మా అమ్మ దగ్గర ఉంటాడు. నేనే శని, ఆదివారాల్లో వెళ్లి వస్తుంటాను." చాలా హాయిగానే ఉన్నాను అన్నట్టుగా నాకు అలా కనబడాలని ఆమె ఉద్దేశ్యం అయి ఉండవచ్చు—నవ్వింది.

"చాలా ఇబ్బంది గదా!" అన్నాను. ఆమె నవ్వును కొట్టేస్తున్నట్టుగా.

"అలాంటి జీవితానికి అలవాటు పడినతరువాత ఏ ఇబ్బందీ కనబడదు!"

శకుంతల మామూలు మనిషి కాదేమోననిపించింది. ఆమెను దేవుడు ఎలాంటి ఆటుపోట్లకయినా తట్టుకునే స్థితికి చేర్చాడు.

మా శ్రీమతి చేతిలో చదవని ఆ పుస్తకం ఎప్పటికీ పూర్తికాదు.

రైలు అతిరయంగా పరుగెడుతున్నది.

కిటికీలోనుండి పరిసరాలను తొంగి చూసిన శకుంతల లేచి నిలబడింది. పైన పెట్టిన చేతిపట్టా సంచీని కిందకు దింపుతున్నప్పుడు రైలు నడకలో వేగం తగ్గటం —ఆపైన రాబోయే ఆలేరు స్టేషన్ అవుటర్ సిగ్నల్ దాటటమూ ఒకేసారి జరిగినయి —నేను ఉలిక్కిపడేలా!

నా పరిధి నిముషాలలోనుండి సెకండ్లలోకి జారిపోతున్నది.

"నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా వెళ్లిపోతున్నారు!" ఆమెనే చూస్తూ చాలా నిస్సహాయంగా అన్నాను. ఆ సమయంలో ఆమె నుండి సమాధానం రాబట్టలేని నా చేతకానితనం మీద నాకే జాలి వేస్తున్నది.

పై నుంచి దించిన సంచీని అప్పటివరకూ తను కూర్చున్న సీటు మీద పెట్టి నా వైపుకు మెడ తిప్పి చిన్నగా నవ్వి ఊరుకున్నది.

ఆ నవ్వు నాలోని ఆవేశం మీద నీళ్లు చల్లుతున్న ప్రయత్నంలా అనిపించింది.

రైలు స్టేషన్‌లోకి వచ్చేస్తోంది. దాని నడక వేగం మరింతగా తగ్గిపోయింది.

ఆమె సంచీని చేత్తో పట్టుకుని "వస్తానండీ!" అంటూ మా ఇద్దరికీ నమస్కారాలు పెట్టి నడుస్తుంటే నేనూ లేచాను ఆమెను అనుసరిస్తున్నట్టుగా. అదాటుగా నా భార్య తన చేతిని నా చేతి మీద వేసింది. అయినా నేను పట్టించుకోలేదు. ముందుకే అడుగువేశాను.

నాలుగు అడుగులు వేసింతరువాత మొండిగా అన్నాను. "నేను అడిగింది చెప్పరా?" అని.

ఆమె వెనక్కు తిరిగి ఫక్కున నవ్వింది.

"మీ ఆ ముక్కు మీద ఉన్న చిన్న పుట్టుమచ్చ నాకు చాలా వికారంగా కనిపించింది. అందుకే కాదు అన్నానూ!" ముందుకు అడుగులువేస్తూనే తల వెనక్కు తిప్పి తన విశాలమైన కళ్లను మరింత విశాలం చేస్తూ చిలిపిగా నవ్వింది.

ఆ నవ్వులో ఎంత మెరుపు ఉన్నా నాకు కోపం ఆగలేదు. "నాన్సెన్స్...." విసురుగా ఆమె చేయి పట్టుకుని ఆపబోయానుగాని నేను జీవితంలో నేర్చుకున్న సభ్యత, సంస్కారం నా చేతుల్ని కట్టివేశాయి.

ఆమె రైలు పెట్టెలో నుండి అక్కడ దిగవలసిన వాళ్లంతా దిగింతరువాత చివరకు దిగింది.

నేను తలుపు దగ్గరే దిగుదామా అన్నట్టుగా నిల్చున్నాను.

ఇది ఆఖరి అవకాశం నాకు. కోపగించుకుని పోగొట్టుకోలేను. అరిచి ఆమె నుంచి సమాధానం పొందలేను. తిట్టి సమాధానం రాబట్టలేను.

ఒక స్త్రీ ముందు ఓడిపోతున్నానేమోననిపించగా దుఃఖం వచ్చింది.

"ప్లీజ్... శకుంతలా... ప్లీజ్!"

గార్డు విజిల్ ఊదారు.

"ఆ కారణం విని మీరు పొందే ఆనందమేమిటి?"

రైలు ఇంజన్ కూత కూసింది.

"నా తప్పేమీ లేకపోతే నా కదే తృప్తి."

"ఆ తృప్తే మీ జీవితానికి సంతోషం కలిగిస్తుందీ అనుకుంటే సరే అలాగే చెబుతాను. వినండి!"

"థాంక్యూ... థాంక్యూ."

"ఆ రోజుల్లో ఓ రాత్రి నేను రహస్య సంభాషణ వినటం తటస్థించింది. చిన్నప్పుడే ఎవరో ఓ గొప్ప వ్యక్తి నేను వివాహమయిన కొద్ది రోజులకే విధవనవుతానని చెప్పాడట. మా వాళ్లు బాధతో తర్జన భర్జనలు పడసాగారు. నాకు ఎంతగానో నచ్చిన మీకు భార్యనయి మీ జీవితంతో ఆటలాడుకోవాలనుకోవటం నాకు వ్యధ గలిగించింది. అందుకే అసలు నేను వివాహమే చేసుకోకూడదు అనుకున్నాను... కానీ...."

ఆమె కదిలిన రైలుకంటే కూడా వేగంగా నడుస్తున్నట్లనిపించింది నాకు!

❀



మా ఊరు హైదరాబాదు, మా వారి ఊరు బెంగుళూరు. బెంగుళూరులో కన్నడ భాష మాట్లాడతారని తెలుసు, కాని నేను ఆ భాషే వినలేదు. నాకు అర్థంకూడా కాదు. ఇక మా అత్తవారింట్లో సగం తెలుగు, సగం కన్నడ పదాలని కలిపి మాట్లాడుతారు. . వారు రెండు, మూడు తరాలుగా బెంగుళూర్‌లోనే ఉంటున్నారు. మా శ్రీవారు మాత్రం అక్కినేని నాగేశ్వరరావుగారి వీరాభిమాని. ఆయన సినిమాలు చూసి చూసి కాస్త తెలుగు మాట్లాడటం నేర్చుకున్నారు కాబట్టి బ్రతికిపోయాను.

నా పెళ్లైన కొత్తలో జరిగిన ఈ సంఘటనను తలుచుకుంటే ఇప్పటికీ నాకు నవ్వు వస్తుంది. ఒకరోజు మావారు పని మీద బయటకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనాలవేళ అయ్యింది. ఇంట్లో నాకు, మా అత్తగారు, మామగారు ఉన్నారు. మా మామగారు భోంచేశారు. ఇక మా అత్తగారు భోజనానికి కూర్చున్నారు. నేను వడ్డన మొదలుపెట్టాను. ఇంతలో మా అత్తగారికి ఏదో జ్ఞాపకం వచ్చి "సంధ్యా! వంటింట్లో చిన్నయేనంలో ఉలువకాయ పల్య ఉంది. పుడికి యెత్తుకురామ్మా!" అన్నారు. ఆవిడ చెప్పిన వాక్యాలు నాకు అస్సలు అర్థంకాలేదు. రెండవసారి ఏమిటన్నారని అడగడానికి భయం, జంకు. వంట ఇల్లు అన్న పదం ఒక్కటి అర్థం అయింది. గబగబా వంట గదిలోకి వెళ్లి ఈవిడకేమి కావాలబ్బా! అని కంగారుగా అన్ని పాత్రలను, డబ్బాలను వెతుకుతున్నా. ఇంతలో మా వారి మాటలు తేనెపలుకుల్లా వినిపించాయి. మంచినీళ్లకని సరాసరి వంట గదిలోకి వచ్చారు.

వెంటనే మా అత్తగారు చెప్పిన మాటలని వారికి చిలకలాగా చెప్పి, ఆ మాటలు అస్సలు అర్థంకాలేదు అన్నాను. దానికి మావారు పడి పడి నవ్వి ఇలా చెప్పారు. "యేనం అంటే పాత్ర, ఉలువకాయంటే బీన్స్, పల్యం అంటే కూర అని, పుడికి అంటే వెతికి తీసుకొనిరా అని అర్థం" అన్నారు. ఇది విన్నాక నాక్కూడా నవ్వు ఆగింది కాదు. నవ్వు ఆపుకుని బీన్స్ కూరని తీసుకెళ్లి మా అత్తగారికి వడ్డించాను.

ఈ సంఘటనని తలుచుకున్నప్పుడల్లా నాకు ఇప్పటికి పాతికేళ్లు దాటినా కూడా ఆపుకోలేనంత నవ్వు వస్తుంది.

సంధ్యా శ్రీనివాసులు (మైసూరు)